కన్నులపండువలా దీపోత్సవం

జగిత్యాలటౌన్‌:జిల్లాకేంద్రంలోని కనకదుర్గ సేవాసమితి ఆధ్వర్యంలో దీపోత్సవాన్ని మహిళలు కనులపండువలా నిర్వహించారు. స్థానిక అష్ట లక్ష్మి ఆలయ ఆవరణలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. దీపోత్సవంలో మాతలు పాల్గొని మోతె చెరువులో దీపాలు వదిలారు.





‘ఓటు ఒక ఆయుధం. దాని విలువ ఉపయోగించే వ్యక్తిని బట్టి ఉంటుంది.’
– టి.రూజ్‌వెల్ట్‌

మీకు తెలుసా?

ఏకగ్రీవ ఎమ్మెల్యే లక్ష్మీనర్సింహారావు

జగిత్యాల నియోజకవర్గం 1957లో ఏర్పడగా.. ఇప్పటివరకు కాసుగంటి లక్ష్మీనర్సింహారావు ఒక్కరే ఏకగ్రీవంగా ఎమ్మెల్యేగా ఎన్నికై చరిత్ర సృష్టించారు. మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన ఆయన జగిత్యాలలోనే స్థిరపడి న్యాయవాదిగా కొనసాగారు. ఆయనను ప్రజలు వకీల్‌సాబ్‌. అని ఆప్యాయంగా పిలిచేవారు. ఆయనకు ప్రజల్లో ఉన్న పేరు, ప్రఖ్యాతులను గుర్తించిన కాంగ్రెస్‌ పార్టీ 1962 అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల టికెట్‌ ఇవ్వగా విజయం సాధించారు. రెండోసారి 1967లోనూ కాంగ్రెస్‌ తరుపున బరిలో నిలవగా.. ఆయనపై ఎవరూ పోటీ చేయకపోవడంతో ఏకగ్రీవమయ్యారు. 1972లోనూ పోటీ చేయాలని కాంగ్రెస్‌ కోరినా.. కొత్తవారికి అవకాశం ఇవ్వాలని టికెట్‌ను తిరస్కరించడం విశేషం. ఆయన శిష్యుల్లో నారాయణరెడ్డి మెట్‌పల్లి, రత్నాకర్‌రావు జగిత్యాల, బుగ్గారం, జగపతిరావు కరీంనగర్‌, జగిత్యాల నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచారు. లక్ష్మీనర్సింహారావు జగిత్యాల నుంచి అసెంబ్లీకి ఆర్టీసీ బస్సులోనే వెళ్లేవారు. గ్రామాల్లో విద్యుత్‌, రోడ్ల సమస్యల పరిష్కారానికి ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చేవారు. ఆయన జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు రూ.కోటిన్నరతో జగిత్యాల కోర్టులో న్యాయవాదుల కోసం గ్రంథాలయాన్ని నిర్మించారు.

– జగిత్యాలజోన్‌



లక్ష్మీనర్సింహారావు



జగిత్యాల కోర్టులో నిర్మించిన గ్రంథాలయం

ఓటు అనేది అత్యంత శక్తివంతమైన అహింసాయుత ఆయుధం.
– జాన్‌ లెవిస్‌



న్యూస్‌రీల్‌

10 కేంద్రాల ద్వారా మొక్కజొన్నల కొనుగోలు



దివ్యభారతి

ఇబ్రహీంపట్నం: జిల్లాలో సింగిల్‌విండో, డీసీఎంఎస్‌ ద్వారా 10 కేంద్రాల నుంచి మొక్కజొన్నలను కొంటామని మార్క్‌ఫెడ్‌ డీఎం దివ్యభారతి తెలిపారు. సింగిల్‌విండో ద్వారా ఇబ్రహీంపట్నం, మల్లాపూర్‌, గొల్లపల్లి, మేడిపల్లి, కథలాపూర్‌, డీసీఎంఎస్‌ ద్వారా జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్‌లో కేంద్రాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కేంద్రాలు గురువారం నుంచే అందుబాటులోకి వస్తాయన్నారు. ఎన్నికల కోడ్‌ నేపథ్యంలో అధికారులే కేంద్రాలు ప్రారంభించాలని, రాజకీయనాయకులెవరినీ పిలువొద్దని సూచించారు. క్వింటాల్‌కు రూ.2,090 మద్దతు ధర అని, 14 శాతం తేమ ఉన్న మొక్కజొన్నలనే కొంటారని, విక్రయించిన 15 రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని వెల్లడించారు.

మంత్రి ‘కొప్పుల’కు ‘దళితబంధు’ సెగ



నాయకులను ప్రశ్నిస్తున్న దళిత యువకుడు

వెల్గటూర్‌: మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు దళితబంధు నిరసన సెగ తగిలింది. ఇంటింటికీ ఈశ్వరన్న కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలకేంద్రంలోని దళితకాలనీలో ప్రచారానికి వచ్చారు. స్థానికులు మంత్రిని దళితబంధు నాయకులకే ఇస్తారా..? తమలాంటి పేదలకు ఇవ్వరా..? అని ప్రశ్నించారు. రూ.రెండు లక్షలు కమీషన్‌ ఇస్తే దళితబంధు ఇప్పిస్తామని పార్టీ నాయకులు అంటున్నారని, ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధిస్తున్నారని తెలిపారు. కూలిపోతున్న తమ ఇళ్లను చూడాలని విన్నవించారు. ‘మీ వెంట ఉన్నవారే తప్పుదోవ పట్టిస్తున్నారు. బీసీని పెళ్లి చేసుకున్న దళిత మహిళకు దళితబంధు ఇప్పించారు..’ అని తెలిపారు.


కేసులు పెడతామని హెచ్చరించిన ఎస్సై

దళితబంధు విషయంలో మంత్రి కొప్పులను ప్రశ్నించిన దళితులపై కేసులు పెడతామని ఎస్సై శ్వేత బెదిరించారు. ఎలక్షన్‌ కోడ్‌ అమలులో ఉండగా ఎలాంటి గొడవలు జరిగినా అందరిపైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తమ బాధలు మంత్రికి చెబితే తమపై కేసులు చేస్తానని ఎస్సై బెదిరించడంపై దళిత మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

కాపుల సమరం!

అసెంబ్లీ బరిలో బీసీలు

- రంగంలో మున్నూరుకాపులు
- కరీంనగర్‌, వేములవాడ, రామగుండంలో దూకుడు
- పద్మశాలీ, ముదిరాజ్‌, గౌడ, కురుమ అభ్యర్థులూ పోటీ
- స్థానికత, సామాజిక సమీకరణలపై నేతల ఆశలు



సాక్షిప్రతినిధి,కరీంనగర్‌: ఈసారి అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా నుంచి పలువురు బీసీ నేతలు ఉన్నారు. వీరిలో అధిక శాతం బలమైన సామాజిక నేపథ్యం, ఉన్నత విద్యావంతులు, రాజకీయ అనుభవం కలిగిన వారే కావడం విశేషం. మున్నూరుకాపు సామాజికవర్గం నుంచి ఎక్కువ మంది అభ్యర్థులు ఉండటం గమనార్హం. వీరే కాక, పద్మశాలీ, గౌడ, ముదిరాజ్‌, యాదవ తదితర బలమైన సామాజికవర్గాల నుంచి రాజకీయ ఆశావహులు బరిలో నిలుస్తున్నారు. నోటిఫికేషన్‌కు ఇంకా సమయం ఉన్న నేపథ్యంలో మరింత మంది బీసీలు అసెంబ్లీ బరిలోకి దిగుతారని సమాచారం. స్థానికత, బీసీ నినాదం, పార్టీ చరిష్మా, మార్పు తదితర అంశాలు తమ విజయానికి దోహదపడతాయని భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం బలమైన బీసీ సామాజికవర్గానికి చెందిన నేతలు పోటీ పడుతున్న నియోజకవర్గాలను ఒకసారి పరిశీలిద్దాం.

వేములవాడ: ఇక్కడి నుంచి గత నాలుగు పర్యాయాలుగా పోటీ చేస్తున్న ఆది శ్రీనివాస్‌(కాంగ్రెస్‌) ఈసారి కూడా బరిలో ఉన్నారు. మున్నూరుకాపు కావడం, దాదాపు 30 వేల పైచిలుకు ఓట్లు తన సామాజికవర్గానికి చెందినవే ఉండటంతో విజయంపై ధీమాగా ఉన్నారు. అదే సామాజికవర్గానికి చెందిన డాక్టర్‌ గోలి మోహన్‌ బీఎస్పీ నుంచి పోటీలో ఉన్నారు. కురుమ సామాజికవర్గానికి చెందిన తుల ఉమ బీజేపీ నుంచి టికెట్‌ ఆశిస్తున్నారు. యాదవులు, కురుమల ఓట్లు 25 వేల వరకు ఉన్నాయని, విజయం సాధిస్తానని భావిస్తున్నారు.

కోరుట్ల: బీజేపీ నుంచి బీసీ నేత, నిజామాబాద్‌ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ బరిలో ఉన్నారు. తన అమ్మమ్మ బంధుగణం, స్నేహితులు, సన్నిహితులు ఇక్కడే ఉండటం, బలమైన మున్నూరుకాపు సామాజికవర్గం, వారివి 26 వేల ఓట్లు ఉండటం మిగిలిన బీసీ కులాలు కూడా మద్దతిస్తారని అర్వింద్‌ వర్గం ధీమాగా ఉంది. వీటికితోడు ముత్యంపేట షుగర్‌ ఫ్యాక్టరీని తెరిపిస్తానన్న హామీ తన విజయానికి దోహదపడుతుందని అంటున్నారు.

జగిత్యాల: బీజేపీ నుంచి పద్మశాలీ సామాజికవర్గానికి చెందిన భోగ శ్రావణి బరిలో ఉన్నారు. సొంత సామాజికవర్గానికి చెందిన 20 వేల ఓట్లు, ప్రధాని మోదీ చరిష్మా, బీసీ నినాదం, ప్రభుత్వ వ్యతిరేకత తమకు కలిసి వస్తాయని ఆమె వర్గం అంటోంది.

కరీంనగర్‌: బీఆర్‌ఎస్‌ నుంచి సిట్టింగ్‌ ఎమ్మెల్యే, మంత్రి గంగుల కమలాకర్‌ బరిలో ఉన్నారు. రాష్ట్రంలోనే బలమైన బీసీ నేతగా గుర్తింపు పొందారు. మున్నూరుకాపు సామాజికవర్గం కావడం, నియోజకవర్గంలో దాదాపు 40 వేల పైచిలుకు వారివే ఓట్లు ఉండటం, కేబుల్‌ బ్రిడ్జి, స్మార్ట్‌ సిటీ, మానేరు రివర్‌ఫ్రంట్‌, సంక్షేమ పథకాలు నాలుగోసారి శాసనసభకు పంపుతాయని గంగుల అభిమానులు లెక్కలు వేసుకుంటున్నారు.

- మరోవైపు బీజేపీ నుంచి బరిలో నిలవనున్న ఎంపీ బండి సంజయ్‌ది కూడా ఇదే సామాజికవర్గం కావడం గమనార్హం. రాష్ట్ర అధ్యక్షుడిగా పార్టీని బలోపేతం చేసిన తీరు, హిందుత్వ నినాదం, కేంద్ర నిధులు, ప్రధాని మోదీ చరిష్మా తదితరాలు కలిసివస్తాయని బండి ధీమాగా ఉన్నారు.

హుజూరాబాద్‌: ఏడుసార్లు ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచిన ఈటల రాజేందర్‌ మరోసారి బరిలో నిలవనున్నారు. బలమైన ముదిరాజ్‌ సామాజికవర్గం కావడం, నియోజకవర్గంలో వారివే 26 వేల ఓట్లు ఉండటం, మంత్రిగా గతంలో ఇక్కడ చేసిన అభివృద్ధి పనులతో తనకు మరోసారి ప్రజా ఆశీర్వాదం లభిస్తుందని విశ్వసిస్తున్నారు.

రామగుండం: ఇక్కడ విచిత్ర పరిస్థితి నెలకొంది. పోటీ చేసే నాయకులంతా బీసీలే. కోరుకంటి చందర్‌(బీఆర్‌ఎస్‌), సోమారపు సత్యనారాయణ ఇద్దరూ బలమైన మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందినవారు. ఈ ఓట్లు నియోజకవర్గంలో దాదాపు 24 వేలు ఉన్నాయి. కాంగ్రెస్‌ నుంచి పోటీ చేస్తున్న మక్కాన్‌ సింగ్‌ ఠాకూర్‌ కూడా బీసీనే. బీసీ నినాదంతోపాటు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌ గాంధీ పర్యటన, సింగరేణి ప్రైవేటీకరణ, ప్రభుత్వ వ్యతిరేకత తనను గెలిపిస్తాయని పేర్కొంటున్నారు.

మంథని: అధికార పార్టీ నుంచి పుట్ట మధు మరోసారి బరిలో నిలుస్తున్నారు. మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందిన బలమైన నేత. వీరి ఓట్లు దాదాపు 29 వేలు ఉన్నాయి. స్థానికుడు, బీఆర్‌ఎస్‌ సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి గెలిపిస్తాయని ఆయన వర్గం భావిస్తోంది.

పెద్దపల్లి: బీఎస్పీ నుంచి పెద్దపల్లి అభ్యర్థిగా బరిలో దిగుతున్న దాసరి ఉషది పద్మశాలీ సామాజికవర్గం. బహుజన నినాదంతో ముందుకు సాగుతున్న ఈమె సొంత సామాజికవర్గం ఓట్లు దాదాపు 35 వేలు వరకు ఉన్నాయి. ప్రభుత్వంపై వ్యతిరేకత, మార్పునకు శ్రీకారం, విద్యావంతుల మద్దతు తదితర అంశాలు ఆమెను గెలిపిస్తాయని ఆమె వర్గం ధీమాగా ఉంది.

హుస్నాబాద్‌: ఇక్కడ కాంగ్రెస్‌ నుంచి మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌, బీజేపీ నుంచి బొమ్మ శ్రీరాం చక్రవర్తి పోటీ పడుతున్నారు. గౌడ సామాజికవర్గానికి చెందిన ఓట్లు 35 వేల పైచిలుకు, మున్నూరుకాపు ఓట్లు దాదాపు 30 వేల వరకు ఉన్నాయి. సొంత సామాజికవర్గాలు, ఇతర బీసీ కులాల మద్దతు, జాతీయ పార్టీల ఇమేజ్‌ తమకు కలిసి వస్తాయని వారు విశ్వసిస్తున్నారు.

యువ ఓటర్లే కీలకం

- ప్రధాన పార్టీ అభ్యర్థుల వివరాల సేకరణ
- కొత్తగా యూత్‌ పోలింగ్‌ కేంద్రాల ఏర్పాటు
- పోలింగ్‌ శాతం పెంచేందుకే..



జగిత్యాల: అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌ శాతం పెంచాలనే ఉద్దేశంతో జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. నవంబర్‌ ఒకటో తేదీ వరకు కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు నమోదుకు అవకాశం కల్పించిన విషయం తెల్సిందే. ఎన్నికల కమిషన్‌ ఆదేశాల మేరకు స్వీప్‌ (సిస్టమెటిక్‌ ఓటర్స్‌ ఎడ్యుకేషన్‌ అండ్‌ ఎలక్టోరల్‌ పార్టిసిపేషన్‌) ద్వారా ఇప్పటికే అధికారులు యువతకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. గత ఎన్నికల్లో యువత ఎక్కువ శాతం ఓటింగ్‌లో పాల్గొనకపోవడంతో ఈసారి వారి పోలింగ్‌ ఎక్కువగా జరగాలనే ఉద్దేశంతో ప్రతిచోట అవగాహన కల్పించారు. వారు ఓటరుగా నమోదు కోసం అవగాహన కూడా కల్పించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారరథాల ద్వారా ప్రచారం చేశారు.

యువతరం ఎటువైపో..?

వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం బరిలో దిగుతున్న అభ్యర్థులు యువతరంపైనే ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో యువత ఓటర్లు సైతం అత్యధికంగా ఉన్నారు. 18 నుంచి 19ఏళ్ల యువత 21,025 మంది (ఇప్పటివరకు) ఉన్నారు. 20 నుంచి 29 ఏళ్ల వారు 1,40,622 మంది, 30 నుంచి 39 ఏళ్ల వారు 1,60,136 మంది ఉన్నారు. రానున్న ఎన్నికల్లో వీరిది కీలకపాత్ర ఉండటంతో ఇప్పటికే ప్రధాన అభ్యర్థులు వారిని మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభిస్తున్నారు. వివరాలు సేకరిస్తూ యువతకు కావాల్సిన హామీలు ఇస్తున్నారు. ప్రస్తుతం గ్రూప్‌-1, గ్రూప్‌-2 పరీక్షలు రద్దు కావడం, ఉద్యోగాలు కల్పించడంలో కొద్దిగా నిర్లక్ష్యంగా ఉండటంతో యువతరం ఎటువైపు మొగ్గుతారో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు మాత్రం యువ ఓటర్లే ఓటింగ్‌లో పాల్గొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వారి కోసం నియోజకవర్గానికో బూత్‌ను ఏర్పాటు చేశారు. ఆ కేంద్రంలో అందరు యువకులే ఉంటారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో యువత ఓట్లు ఎక్కడున్నారంటూ పూర్తి వివరాలు సేకరిస్తూ వారి కోసం ప్రధాన అభ్యర్థులు పరిశీలన చేస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు యువతరం ఈసారి తమవైపే ఉంటారని భావిస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గానికో యూత్‌ పోలింగ్‌ కేంద్రం ఏర్పాటు చేయడంతో పోలింగ్‌ శాతం పెరిగే అవకాశాలున్నాయి. గతంలో ఇలాంటివి లేకపోవడంతో యువత ఓటు వేసేందుకు యువత అంత ఆసక్తి చూపేవారు కాదు. ఈసారి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరినీ ఓటరుగా నమోదు చేయడంతోపాటు ఆసక్తి చూపని వారికి అవగాహన కల్పించారు బీఎల్వోలు. దీంతో యువ ఓటర్లు జిల్లాలో అత్యధికంగా పెరిగిపోయారు.

యూత్‌ పోలింగ్‌ కేంద్రాలు

ఎన్నికల కమిషన్‌ ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్‌ కేంద్రంలో యూత్‌ పోలింగ్‌ కేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. ఓటు వజ్రాయుధం. యువత తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలి. స్వీప్‌ ద్వారా అవగాహన కల్పించాం.
– యాస్మిన్‌ బాషా, కలెక్టర్‌

జిల్లాలో యువ ఓటర్ల వివరాలు ఇలా..

వయసు	ఓటర్లు
18–19	21,025
20–29	1,40,622
30–39	1,60,136

యూత్‌ పోలింగ్‌ కేంద్రాలు

- కోరుట్ల 134వ పోలింగ్‌ కేంద్రం
- సారంగాపూర్‌ 90వ పోలింగ్‌ కేంద్రం
- ధర్మారం 162వ పోలింగ్‌ కేంద్రం

జిల్లాకు చేరిన కేంద్ర బలగాలు



జిల్లా కేంద్రంలో జెండా ఊపి కవాతును ప్రారంభిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌ సింగ్‌, చిత్రంలో పోలీస్‌ అధికారులు

- జిల్లా కేంద్రంలో కవాతు
- పాల్గొన్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌

జగిత్యాలక్రైం: ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు జిల్లాకు కేంద్రబలగాలు బుధవారం చేరుకున్నాయి. జిల్లాకేంద్రంలోని మినీస్టేడియం నుంచి 300 మంది జిల్లా పోలీసు, కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్‌ కవాతును ఎస్పీ సన్‌ప్రీత్‌ సింగ్‌ ప్రారంభించారు. ఓల్డ్‌బస్టాండ్‌, తహసీల్‌చౌరస్తా, టవర్‌సర్కిల్‌, తీన్‌ఖని, ఖిలాగడ్డ, గంజ్‌రోడ్‌ మీదుగా కవాతు సాగింది. ఎస్పీ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఎన్నికల్లో పాల్గొనాలన్నారు. ఫ్లాగ్‌మార్చ్‌ను జిల్లాలోని అన్ని పట్టణాల్లో చేపడుతామన్నారు. త్వరలో మరో ఆరు కంపెనీల కేంద్రసాయుధ బలగాలు జిల్లాకు వస్తాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్‌ ఎస్పీలు ప్రభాకర్‌రావు, భీంరావ్‌, బీఎస్‌ఎఫ్‌ అసిస్టెంట్‌ కమాండెంట్లు దిపాకర్‌, సునిల్‌కుమార్‌, డీఎస్పీలు రవీంద్రకుమార్‌, వెంకటస్వామి, రవీందర్‌రెడ్డి, సీఐలు నటేశ్‌, కోటేశ్వర్‌, రమణమూర్తి, ఆరీఫ్‌అలీ ఖాన్‌, ఆర్‌ఐలు వేణు, రామకృష్ణ, జానిమియా, ఎస్సైలు పాల్గొన్నారు.



కవాతులో కేంద్ర బలగాలు, పోలీసు సిబ్బంది

కేంద్ర బలగాలతో ఎస్పీ సమావేశం

ముందుగా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌ తన కార్యాలయంలో కేంద్ర బలగాలతో సమావేశమయ్యారు. జిల్లా పోలీసులతో కలిసి ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా చూడాలన్నారు. క్రిటికల్‌ పోలింగ్‌ స్టేషన్లలో రూట్‌ బందోబస్తు కీలకమైన పాయింట్ల వద్ద సెంట్రల్‌ ఫోర్స్‌ సిబ్బంది ఉంటారని తెలిపారు. కేంద్ర బలగాలకు వసతులు కల్పించాలని డీఎస్పీలను ఆదేశించారు.

జెడ్పీ సమావేశం వాయిదా

జగిత్యాలజోన్‌: జెడ్పీ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించాల్సి ఉండగా.. సభ్యులు హాజరు కాకపోవడంతో వాయిదా పడింది. కోరం లేకపోవడంతో వాయిదా వేశామని, ఎప్పుడు నిర్వహించేది త్వరలో నిర్ణయిస్తామని జెడ్పీ సీఈఓ నరేష్‌ తెలిపారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు

జగిత్యాలరూరల్‌/కోరుట్లరూరల్‌/మల్లాపూర్‌/రాయికల్‌: జిల్లాకేంద్రంతోపాటు కోరుట్ల, మల్లాపూర్‌, రాయికల్‌ తదితర మండలాల్లో బతుకమ్మ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బతుకమ్మలను అందంగా పేర్చి ఆటపాటలతో అలరించారు. కోరుట్లలో జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, వైస్‌ ఎంపీపీ చీటి స్వరూపారాణి బతుకమ్మ ఆడి మహిళలను ఉత్తేజపరిచారు. మల్లాపూర్‌లో ఎంపీపీ కాటిపెల్లి సరోజన, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీ బద్దం విజయ బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. సారంగాపూర్‌ మండలం లక్ష్మీదేవిపల్లి, బీర్‌పూర్‌ మండలం చెర్లపల్లి గిరిజనతండాల్లో మహిళలు బతుకమ్మ పండగను ఘనంగా జరుపుకున్నారు. రాయికల్‌ మండలంలోని కుమ్మరిపల్లి, ఇటిక్యాల, మైతాపూర్‌, ఆలూర్‌లో మహిళలు గౌరీదేవికి పూజలు చేశారు. ఆలూర్‌, మైతాపూర్‌లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి భోగ శ్రావణి బతుకమ్మ ఆడారు.









జగిత్యాలరూరల్‌: బతుకమ్మలతో మహిళలు





కోరుట్లరూరల్‌: సంగెంలో..



కోరుట్లరూరల్‌: మాదాపూర్‌లో..





కోరుట్లరూరల్‌: బతుకమ్మతో జెడ్పీటీసీ లావణ్య



మల్లాపూర్‌: బతుకమ్మలతో తరలివస్తున్న చిన్నారులు



మల్లాపూర్‌: కొత్తదాంరాజుపల్లిలో మహిళల సందడి



రాయికల్‌:మైతాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న భోగ శ్రావణి

క్లుప్తంగా

గిరిజనుల సంక్షేమమే 'లోడి' లక్ష్యం



అయోధ్యలో జర్మనీ ప్రతినిధులకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

రాయికల్(జగిత్యాల): గిరిజనుల సంక్షేమమే లోడి సంస్థ లక్ష్యమని జర్మనీ ప్రతినిధులు ఫిలిప్, మార్విస్ అన్నారు. బుధవారం రాయికల్ మండలంలోని అయోధ్య, ఒడ్డెలింగాపూర్, చింతలూరు, చెర్లకొండాపూర్, ఆలూర్ గ్రామాల్లో సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన చెక్‌డ్యాంలు, తూములను, వర్మి కంపోస్టు, వేపనూనె తయారీ, సేంద్రియ కూరగాయల సాగును పరిశీలించారు. గ్రామీణ నిరుపేదలు, గ్రామాల అభివృద్ధికి లోడి సంస్థ కృషి చేస్తోందని పేర్కొన్నారు. అనంతరం వీరిని గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు విజమ్‌పాల్‌రెడ్డి, ఇయాన్‌రెడ్డి, ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ సభ్యురాలు జాదవ్ అశ్విని, సర్పంచ్‌లు జీవన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, చిన్నమల్లయ్య, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

రామగుండం: లారీ ఢీకొని, ఓ వ్యక్తి మృతిచెందాడు. అంతర్గాం ఎస్సై సంతోష్‌కుమార్ వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలంలోని కనగర్తికి చెందిన గుంటి శ్రీనివాస్(45) ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు. ప్రతీరోజు స్వగ్రామం నుంచి ఆర్టీసీ బస్సులో విధులకు హాజరవుతున్నాడు. బుధవారం ఉదయం పని ముగించుకొని, ఇంటికి వెళ్తూ పనిమీద ఎన్టీపీసీ రాజీవ్ రహదారి బీవోసీ బస్టాప్ వద్ద దిగాడు. రోడ్డు దాటుతుండగా కరీంనగర్ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

- దంపతులకు తీవ్ర గాయాలు

సుల్తానాబాద్ రూరల్: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై విజేందర్ వివరాల ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెద్దరాతుపల్లికి చెందిన పాడిశెట్టి రమేశ్ బుధవారం తన భార్యతో కలిసి ద్విచక్రవాహనంపై సుల్తానాబాద్ వచ్చాడు. సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్తుండగా అల్లీపూర్ శివారులో కాల్వశ్రీరాంపూర్ నుంచి సుల్తానాబాద్ వస్తున్న బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రమేశ్ కాలు విరిగింది. అతని భార్యకు గాయాలయ్యాయి. బాధితులను బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు 108 వాహనంలో కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

యువకుడికి గాయాలు

రామగిరి(మంథని): మండలంలోని నాగేపల్లికి చెందిన కట్కూరి సాయితేజ(20) రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం.. సాయితేజ బుధవారం సెంటనరీకాలనీ నుంచి నాగేపల్లికి వస్తున్నాడు. అదే సమయంలో ఓ కారు కరీంనగర్ వైపు వెళ్తోంది. రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో సాయితేజకు గాయాలయ్యాయి. అతనికి సెంటనరీకాలనీ డిస్పెన్సరీలో చికిత్స అందించారు. అనంతరం కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ కంపెనీ ప్రొవైడ్ అన్ని రకముల బిజినెస్ ప్రాపర్టీ, పర్సనల్ అగ్రికల్చర్, టేకోవర్ కొరకు DSA & ఏజెంట్స్ కావలెను. Salary+Commission, 9990752820. [T-194]

WANTED

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడి వంట మనుషులు, వార్డ్ బాయ్స్, ఆయాలు, భార్యాభర్తలు, గార్డెన్ పని & ఆవులు చూసుకొనుటకు వాచ్‌మెన్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-12454]


గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824

వలస నేతల వస్త్ర నేల!

- సిరిసిల్లగా మారిన నేరెళ్ల • మెట్ట ప్రాంతం.. కార్మిక క్షేత్రం • నాడు కాంగ్రెస్.. నేడు టీఆర్ఎస్



ఒకప్పటి నేరెళ్ల.. నేటి సిరిసిల్ల నియోజకవర్గం వలసనేతలకు నిలయంగా మారింది. 1952 నుంచి ఇప్పటి వరకు ప్రతీసారి ఇతర ప్రాంతాలకు చెందిన నేతలే ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. 1962లో ఏర్పడిన నేరెళ్ల నియోజవర్గం 2009లో సిరిసిల్లగా మారింది. నేరెళ్ల నియోజకవర్గం నుంచి గెలుపొందిన వారికి మంత్రి యోగం దక్కింది. రెండుసార్లు స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన తంగళ్లపల్లికి చెందిన గొట్టె భూపతి మినహా.. కర్రెల్లి నర్సయ్య, సుద్దాల దేవయ్య, కాసిపేట లింగయ్య, ప్రస్తుతం ఎమ్మెల్యే కె.తారకరామారావు స్థానికేతరులే.


కె.తారకరామారావు


కాసిపేట లింగయ్య


కర్రెల్లి నర్సయ్య


గొట్టె భూపతి


పాటి రాజం


సుద్దాల దేవయ్య

నేటి సిరిసిల్ల నాటి నేరెళ్ల ఎమ్మెల్యేలు

పదవి కాలం	ఎమ్మెల్యే	పార్టీ
1957-1962	కర్రెల్లి నర్సయ్య	పీడీఎఫ్
1962-1967	బి.జానకీరాం	కాంగ్రెస్
1967-1972	గొట్టె భూపతి	ఇండిపెండెంట్
1972-1978	గొట్టె భూపతి	ఇండిపెండెంట్
1978-1983	పాటి రాజం	కాంగ్రెస్(ఐ)
1983-1885	పాటి రాజం	కాంగ్రెస్
1985-1989	ఉప్పరి సాంబయ్య	జనతా
1989-1994	పాటి రాజం	కాంగ్రెస్
1994-1999	సుద్దాల దేవయ్య	టీడీపీ
1999-2004	సుద్దాల దేవయ్య	టీడీపీ
2004-2009	కాసిపేట లింగయ్య	టీఆర్ఎస్
2009-2010	కె.తారకరామారావు	టీఆర్ఎస్
2010-2014(ఉపఎన్నిక)	కె.తారకరామారావు	టీఆర్ఎస్
2014-2015	కె.తారకరామారావు	టీఆర్ఎస్
2018-2023	కె.తారక రామారావు	టీఆర్ఎస్

సిరిసిల్ల: సిరిసిల్ల.. మెట్టప్రాంతం..కార్మికక్షేత్రం. ఐదు దశాబ్దాలపాటు నేరెళ్ల నియోజకవర్గంగా ఉన్న ప్రాంతం 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా సిరిసిల్లగా ఏర్పడింది. వస్త్రోత్పత్తి ఖిల్లా సిరిసిల్ల పట్టణంతో కలిసి ఒకప్పటి నేరెళ్ల(ఎస్సీ) నియోజకవర్గ పరిధిలోని ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, గంభీరావుపేట, తంగళ్లపల్లి మండలాల్లోని గ్రామాలను ఈ నియోజకవర్గంలో కొత్తగా కలిపారు. పాత నేరెళ్ల నియోజకవర్గం పరిధిలోని ఇల్లంతకుంట మండలాన్ని మానకొండూరు(ఎస్సీ)లో కలిపారు. ఒకప్పటి నేరెళ్ల రాజకీయ చరిత్రనే సిరిసిల్లకు వర్తిస్తుంది. నాటి సిరిసిల్ల నియోజకవర్గంలోని మండలాలను కలిపి కొత్తగా వేములవాడ నియోజకవర్గంగా ఏర్పాటైంది.

అరవై ఆరేళ్లుగా..

1952లో ద్విసభ్య నియోజకవర్గంగా సిరిసిల్ల ఉంది. దీని పరిధిలో వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాలు ఉండేవి. తొలిసారిగా 1952లో జరిగిన ఎన్నికల్లో పీడీఎఫ్ ఒక స్థానాన్ని, షెడ్యూల్ కులాల సమాఖ్య మరోస్థానాన్ని పొందాయి. 1957లో జరిగిన ఎన్నికల్లో రెండు స్థానాలు పీడీఎఫ్ గెలుచుకుంది. 1962లో తొలిసారిగా నేరెళ్ల నియోకవర్గం ఏర్పాటైంది. తంగళ్లపల్లి మండలంలోని నేరెళ్ల గ్రామం పేరిట ఈ నియోజకవర్గం ఏర్పడగా.. గంభీరావుపేట, ఇల్లంతకుంట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల పట్టణంతోపాటు శివారు గ్రామాలతో కలిపి విస్తరించి ఉంది. నేరెళ్ల నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన పాటి రాజం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, చిన్ననీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేశారు. టీడీపీ హయాంలో సుద్దాల దేవయ్య సహకారశాఖ, కార్మికశాఖ మంత్రిగా కొనసాగారు.



టెక్స్‌టైల్ పార్క్

ప్రస్తుత సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖల మంత్రిగా ఉన్నారు. పాటి రాజం మంత్రిగా ఉండగానే 1994లో హఠాన్మరణం పొందారు. పాటి రాజం ఇక్కడ మూడు సార్లు, సుద్దాల దేవయ్య రెండు సార్లు, కేటీఆర్ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరుగగా.. పీడీఎఫ్ ఒక్కసారి, కాంగ్రెస్, కాంగ్రెస్(ఐ) పార్టీ నాలుగుసార్లు, తెలుగుదేశం రెండు సార్లు, జనతాపార్టీ ఒక్కసారి, స్వతంత్ర అభ్యర్థులు రెండు సార్లు, టీఆర్ఎస్ ఐదు సార్లు గెలిచింది.

ఈ ప్రాంత ప్రత్యేకతలు

- పశ్చిమాన కామారెడ్డి, దక్షిణాన సిద్దిపేట జిల్లాతో ఈ నియోజకవర్గం కలిసి ఉంది.
- మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒక్కటైన ఎగువ మానేరు జలాశయం గంభీరావుపేట మండలం నర్మాలలో ఉంది. దీన్ని నిజాం చివరి నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1945–51 మధ్య నిర్మించారు. 32 అడుగుల నీటి సామర్థ్యం గల ఈ జలాశయం గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని 17 వేల ఎకరాలకు నీరందించాల్సి ఉండగా.. ప్రస్తుతం 10వేల ఎకరాలకు కుదించారు.
- ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాల్లో అటవీప్రాంతం విస్తరించి ఉంది.
- సిరిసిల్ల పట్టణంలో 34 వేల మరమగ్గాలతో రెండో షోలాపూర్‌గా ఖ్యాతిగాంచింది. 75 అద్దకం, 30 సైజింగ్, 65 వార్పిన్ పరిశ్రమలు ఉన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 25 వేల మంది కార్మికులు వస్త్రపరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు.
- రాష్ట్రంలోనే తొలి టెక్స్‌టైల్ పార్కును సారంపల్లి–బద్దెనపల్లి గ్రామాల మధ్య నెలకొల్పారు. పార్క్‌లో 115 పరిశ్రమలు వస్త్రోత్పత్తిని సాధిస్తుండగా.. మూడు వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు.
- సిరిసిల్ల నియోజకవర్గానికి ఎగువమానేరు ప్రధాన నీటివనరు కాగా.. ఇప్పుడు మధ్యమానేరు ప్రధాన సాగునీటి వనరుగా మారింది.
- సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) సిరిసిల్ల ప్రాంతంలో విద్యుత్ పంపిణీ చేస్తుంది. దేశంలోనే అగ్రగామి సంస్థగా ఖ్యాతిగాంచింది.
- గల్ఫ్ వలసలు ఇప్పటికీ ఆగలేదు.
- నియోజకవర్గం పొడవునా మానేరుతీరం ఉండడం మరో విశేషం.

ప్రస్తుత పరిస్థితి

- ఒకప్పుడు నేరెళ్ల నియోకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేది. తొలినాళ్లలో పీడీఎఫ్ అభ్యర్థులు విజయం సాధించగా.. తరువాత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. పాటి రాజం మరణాంతరం జరిగిన 1994 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సుద్దాల దేవయ్య కాంగ్రెస్ అభ్యర్థి గొట్టె భూపతిపై అనూహ్య విజయం సాధించారు. 1999లోనూ దేవయ్య గెలుపొందారు. 2004లో టీఆర్ఎస్ అభ్యర్థి కాసిపేట లింగయ్య, సుద్దాల దేవయ్యపై విజయం సాధించారు. 2009 మహాకూటమి అభ్యర్థిగా టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తనయుడు కె.తారకరామారావు సిరిసిల్ల బరిలో నిలిచి 171 స్వల్ప ఓట్ల తేడాతో స్వతంత్ర అభ్యర్థి కె.కె.మహేందర్‌రెడ్డిపై విజయం సాధించారు. ప్రస్తుతం కె.కె.మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. 2010లో రాష్ట్ర సాధన ఉద్యమంలో కేటీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయగా.. తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లోనూ కేటీఆర్, మహేందర్‌రెడ్డిపై గెలుపొందారు. 2014లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కొండూరి రవీందర్‌రావుపై కేటీఆర్ విజయం సాధించారు. ప్రస్తుతం కొండూరి రవీందర్‌రావు టీఆర్ఎస్‌లో చేరి, టెస్కాబ్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. తర్వాత వివిధ పరిణాలతో టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా మారింది. బీఆర్ఎస్ అభ్యర్థిగా మళ్లీ మంత్రి కేటీఆర్ బరిలో దిగుతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా కె.కె. మహేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా రాణి రుద్రమారెడ్డి పోటీలో ఉంటుండగా.. ఇంకా బీఎస్పీతోపాటు ఇతర పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించలేదు. సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు రాష్ట్ర కీలకమంత్రిగా ఉండడంతో జిల్లా కేంద్రం తోపాటు నియోజకవర్గంలో గత తొమ్మిదేళ్లలో అభివృద్ధి పనులు వేగంగా జరిగాయి. నియోజకవర్గ రూపురేఖలు మారిపోయాయి. మెడికల్ కాలేజీ, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్, వ్యవసాయ డిగ్రీ కాలేజీతోపాటు గార్మెంట్ పరిశ్రమ విస్తరించాయి. జిల్లాలో ఉపాధి అవకాశాలు పెరిగాయి.

ఆశ.. అడియాస!

- బీజేపీ టికెట్ ఆశించిన నలుగురు నాయకులు
- ఎంపీ అర్వింద్‌కు ఇవ్వడంతో నిరాశ
- కోరుట్ల నియోజకవర్గంలో పరిస్థితి



కోరుట్ల: ఆ నలుగురు నాయకులు కోరుట్ల బీజేపీ టికెట్ ఆశించి, ఏడాదిగా పార్టీలో క్రియాశీలకంగా పని చేశారు. ఆశావహులను ఆశల పల్లకిలో ఉంచిన బీజేపీ టికెట్ చివరికి నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌కు వచ్చింది. దీంతో ఆ నాయకుల ఆశ అడియాస అయ్యింది.

పసుపు బోర్డు, షుగర్ ఫ్యాక్టరీపై ప్రచారం

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో.. ఏడాది క్రితం కోరుట్ల నుంచి టికెట్ ఆశించి, సురభి భూంరావు కుమారుడు నవీన్‌కుమార్ బీజేపీలో చేరారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాలుపంచుకున్నారు. 2014లో బీజేపీ తరపున కోరుట్ల నుంచి పోటీ చేసిన భూంరావు 35 వేల ఓట్లు సాధించి, మూడో స్థానంలో నిలిచారు. బీజేపీ నాయకుడు జేఎన్ వెంకట్ సతీమణి సునీత 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీ చేసి, 20 వేల పైచిలుకు ఓట్లు సాధించారు. ఆమె ఈసారి తనకు బీజేపీ టికెట్ వస్తుందనుకున్నారు. వీరితోపాటు పద్మశాలీ వర్గానికి చెందిన సాంబారి ప్రభాకర్, ఇటీవల పార్టీలో చేరిన డాక్టర్ రఘు సైతం టికెట్ ఆశించినట్లు సమాచారం. వీరు ఎంతో ఆశగా ఎదురుచూస్తుండగానే పసుపు బోర్డు, షుగర్ ఫ్యాక్టరీ నినాదాలతో నిజామాబాద్ ఎంపీ అర్వింద్ కోరుట్ల నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. చివరికి ఆయన అభ్యర్థిత్వమే ఖరారైంది.

చివరివరకు ఊగిసలాట

కోరుట్ల బీజేపీ అభ్యర్థిగా ఎంపీ అర్వింద్ పోటీ చేస్తారని ప్రచారం జరుగుతున్నా ఆయన ప్రచార సభల్లోనూ ఎక్కడా స్పష్టత ఇవ్వకపోవడంతో అయోమయం నెలకొంది. గత కొన్ని రోజులుగా కోరుట్ల సెగ్మెంట్‌లో సొంతంగా సర్వే చేయించి, బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. దీంతోపాటు అసెంబ్లీ పరిధిలో ఇతర పార్టీలో ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులతో మంతనాలు జరిపి, పార్టీలోకి రావాలని కోరినట్లు సమాచారం. వీరిలో కొందరు ఇటీవల పార్టీలో చేరడం గమనార్హం. మొత్తం మీద బీజేపీ అభ్యర్థిగా ఎంపీ అర్వింద్ పేరు ఖరారు కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

భర్త అరెస్టు

జగిత్యాల క్రైం: జగిత్యాల పట్టణంలోని 47వ వార్డు టీఆర్‌నగర్‌కు చెందిన కట్ల సుమలతను హత్య చేసిన ఆమె భర్త సంజీవ్‌ను అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్ తెలిపారు. కొడిమ్యాల మండలంలోని నల్లగొండకు చెందిన కన్నం వెంకటయ్య కూతురును టీఆర్‌నగర్‌కు చెందిన సంజీవ్‌కు ఇచ్చి, వివాహం చేశారు. కొంతకాలంగా అదనపు కట్నం కావాలంటూ సంజీవ్ ఆమెను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో గత సోమవారం సుమలతను గొంతు నులిమి హత్య చేశాడు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సంజీవ్‌ను బుధవారం రాత్రి అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎస్సై సదాకర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.



అరెస్టు చూపుతున్న సీఐ ఆరిఫ్ అలీఖాన్

బ్యాటరీ స్టవ్‌ల పట్టివేత

సారంగాపూర్(జగిత్యాల): రూ.1.44 లక్షల విలువైన బ్యాటరీ స్టవ్‌లను పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు బుధవారం వాహన తనిఖీలు చేపట్టారన్నారు. గడ్డం శ్రీనివాస్ జగిత్యాల నుంచి నిర్మల్ జిల్లా ఊట్నూర్‌కు వ్యాన్‌లో తరలిస్తున్న 72 బ్యాటరీ స్టవ్‌లను పట్టుకొని, సీజ్ చేసినట్లు తెలిపారు. తర్వాత వాటిని జిల్లా ఎన్నికల అధికారికి అప్పగించినట్లు పేర్కొన్నారు.



స్టవ్‌ల వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై

దాడి ఘటనలో 8 మందిపై కేసు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని బంజరుదొడ్డి ప్రాంతానికి చెందిన పెద్దింటి రాజుపై దాడి చేసిన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు జగిత్యాల పట్టణ ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు. రాజుకు అదే ప్రాంతానికి చెందిన సట్ట శ్రీనివాస్ మధ్య కొంతకాలంగా గొడవలున్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి సట్ట శ్రీనివాస్, సతీశ్, భిక్షపతి, లక్ష్మి, మణిదీప్, బొరగల రమేశ్, విజయ్‌లు అక్రమంగా అతని ఇంట్లోకి ప్రవేశించారని అన్నారు. బండరాళ్లతో దాడి చేశారని బాధితుడి భార్య రజిత బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఐదుగురిపై హత్యాయత్నం కేసు

బంజరుదొడ్డి ప్రాంతానికి చెందిన సట్ట శ్రీనివాస్, సతీశ్, రవిలపై కత్తెరతో దాడి చేసిన ఐదుగురు వ్యక్తులపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ నటేశ్ తెలిపారు. పాత గొడవలు మనసులో పెట్టుకొని పెద్దింటి రాజు, రజిత, రాకేశ్, అజయ్, విజయ్‌లు మంగళవారం రాత్రి వారిపై దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయని పేర్కొన్నారు. సట్ట భిక్షపతి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వెంకట్రావుపేటలో ముగ్గురిపై..

మేడిపల్లి: భీమారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో దసరా రోజు గాజు లఅర్వింద్ పై కర్రలతో దాడి చేసి, గాయపరిచిన మేదరి రాజేశ్, మేదరి రాజు, కుమ్మరి రాజేందర్ లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ బుధవా రం తెలిపారు.

హౌసింగ్ లోన్ పేరిట మోసం

- రూ.22,104 టోకరా

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రానికి చెందిన కట్ల గంగాధర్‌ను హౌసింగ్ లోన్ పేరిట సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. సైబర్ నేరగాళ్లు గంగాధర్‌కు కొన్ని రోజుల క్రితం ఇండియన్ బుల్స్ హౌసింగ్ లోన్ పేరిట ఫోన్ చేసి, రుణం మంజూరైందని నమ్మించారు. దీంతో అతను మూడు దఫాల్లో రూ.22,104 చెల్లించాడు. కానీ, రుణం డబ్బులను బ్యాంక్ ఖాతాలో జమ చేయకపోవడంతో మోసపోయానని నిర్ధారించుకున్నాడు. బుధవారం జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు



బజ్జీలు చేస్తున్న మంత్రి ఈశ్వర్

వెల్గటూర్(ధర్మపురి): బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందాయని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం వెల్గటూర్ మండల కేంద్రంలో ఇంటింటికీ ఈశ్వరన్న కార్యక్రమంలో భాగంగా గడపగడపకూ వెళ్లి, ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. స్థానికంగా బజ్జీలు వేసి, అందరిలో ఉత్సాహం నిం పారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ఆపద మొక్కులతో వస్తున్నారని విమర్శించారు. 40 ఏళ్ల అధికారంలో ఉన్నప్పుడు చేయలేని అభివృద్ధి ఇప్పుడు ఎలా చేస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ వెల్గటూర్, ఎండపల్లి మండలాల అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురిని మరింత అభివృద్ధి చేస్తా

ధర్మపురి: రానున్న రోజుల్లో ధర్మపురిని మరింత అభివృద్ధి చేస్తానని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని కాశెట్టివాడకు చెందిన యువకులు బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. ధర్మపురి పుణ్యక్షేత్ర అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపిస్తే ధర్మపురి రూపురేఖలు మారుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవ్వా... ఆశీర్వదించండి



ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: అవ్వా.. మరోసారి ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. బుధవారం జగిత్యాలలోని 32వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

జగిత్యాలరూరల్: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. బుధవారం జగిత్యాల అర్బన్ మండలంలోని మోతె గ్రామానికి చెందిన 50 మంది యూత్ సభ్యులు బీఆర్ఎస్‌లో చేరారు. జెడ్పీటీసీ సభ్యుడు మహేశ్, సర్పంచ్ సురకంటి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి కృషి

రాయికల్(జగిత్యాల): దళితుల సంక్షేమానికి బీఆర్ఎస్ సర్కారు కృషి చేస్తోందని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. బుధవారం అల్లీపూర్‌కు చెందిన అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వేల్పుల ప్రవీణ్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎంపీటీసీ విజయలక్ష్మి, సింగిల్‌విండో చైర్మన్ రాజలింగం, నాయకులున్నారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే

వెల్గటూర్(ధర్మపురి): రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఎండపల్లి మండలంలోని రాజారాంపల్లి ఎస్సీ కాలనీవాసులు, ధర్మారం మండలంలోని దొంగతుర్తి, కమ్మర్‌ఖాన్ పేట నుంచి వివిధ పార్టీల కార్యకర్తలు, యువకులు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేవలం ఆ పార్టీ కార్యకర్తలకు తప్ప ఎవరికీ మేలు జరగలేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే తమ అధినేత్రి సోనియాగాంధీ ప్రటించిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. పార్టీ వెల్గటూర్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, ధర్మారం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు రమేశ్, వెల్గటూర్ సర్పంచ్ మురళిగౌడ్, నియోజకవర్గ అధికార ప్రతినిధి విజయ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రావు, నాయకులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరినవారితో లక్ష్మణ్‌కుమార్

ఒక్క అవకాశం ఇవ్వండి

ధర్మపురి: రానున్న ఎన్నికల్లో తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని డీసీసీ అధ్యక్షుడు, ధర్మపురి నియోజకవర్గ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. ధర్మపురి పట్టణంలోని తెనుగువాడలో బుధవారం ప్రచారం నిర్వహించారు. స్థానిక యువకులు సుమారు 50 మంది కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ పాలనలో ధర్మపురిలో చేసిన అభివృద్ధి ఏమిటో చూపించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎస్.దినేశ్, వేముల రాజేశ్, ప్రసాద్, లక్ష్మణ్ తదితరులున్నారు.

అవినీతికి కేరాఫ్ చొప్పదండి ఎమ్మెల్యే

కొండగట్టు(చొప్పదండి): చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా మారారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపెల్లి సత్యం ఆరోపించారు. కొడిమ్యాల మండలంలోని పూడూర్ గ్రామంలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదని విమర్శించారు. నాయకులు చిలువేరి నారాయణగౌడ్, గోగూరి మహిపాల్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, కడారి మల్లేశం తదితరులున్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

కొడిమ్యాల మండలంలోని దమ్మయ్యపేటలో ఒడ్డెర సంఘానికి చెందిన 50 మంది బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వారికి కండువాలు కప్పి, ఆహ్వానించారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, సింగిల్‌విండో చైర్మన్ మేనేని రాజనర్సింగరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పులి వెంకటేశ్ గౌడ్, దమ్మయ్యపేట, చింతలపల్లి సర్పంచ్‌లు తునికి నర్సయ్య, మల్యాల మహిపాల్, నాయకులున్నారు.



పూడుర్‌లో ప్రచారం చేస్తున్న సత్యం

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): తనకు ఒకసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బుధవారం వేములకుర్తి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. మాయమాటలు చెప్పే నాయకులకు నమ్మి, ఓట్లు వేసి మోసపోవద్దని కోరారు. కారు గుర్తుకు ఓటు వేసి, తనను భారీ మెజారిటీతో గెలిపించాలని విన్నవించారు. నిర్మల్ జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుడ్ల రామకృష్ణ తండ్రి ప్రభాకర్ కొన్ని రోజుల క్రితం మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. నాయకులు సున్నం సత్యం, పెంట లింబాద్రి, దొెట్టి రాజరెడ్డి, శ్రీకాంత్, నాగరాజు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



వేములకుర్తిలో ప్రచారం చేస్తున్న సంజయ్